# సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం | 24 | ఆగస్టు | 2024






**పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ**

వేములవాడఅర్బన్: చీర్లవంచలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం నిర్వహించారు.



**వరలక్ష్మీ వ్రతాలు**

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పూలు పట్టువస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు.

గరిష్టం/కనిష్టం
31.0/26.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### వేములవాడలో రేపు మెగా జాబ్‌మేళా



సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

సిరిసిల్ల: వేములవాడలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా, రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, మార్కెటింగ్, ఆటోమొబైల్స్, మేనేజ్‌మెంట్, సెక్యూరిటీలకు చెందిన 50కి పైగా కంపెనీలు వస్తున్నట్లు వివరించారు. స్థానిక మహాలింగేశ్వర గార్డెన్స్‌లో జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నేడు ఎల్‌ఎండీకి నీటి విడుదల



మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీలోకి శనివారం నీటి విడుదల చేయనున్నట్లు మిడ్‌మానేరు ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మానేరునదిలో ఉన్న మోటార్లను తొలగించాలని రైతులను కోరారు. ప్రస్తుతం మిడ్‌మానేరులో 17.56 టీఎంసీల మేర నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

### అధిక ఫీజులు కేంద్రం చలవే..

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రంజిత్



రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల నేతలు

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ లోపభూయిష్ట విధానాలతోనే ప్రైవేటు, కార్పొరేట్‌రంగాల్లో అధిక ఫీజుల దోపిడీ జరుగుతుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని కార్మికభవనంలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. 2020లో పార్లమెంటులో ఎలాంటి చర్చలేకుండానే బీజేపీ సర్కారు నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో అధిక ఫీజుల నియంత్రణ లేకపోవడం పేద విద్యార్థులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుగుదేవ్ చరిత్రను పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టాలని కోరారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలపై పోరాటాలు తప్పవన్నారు. గుడిసె ప్రభాకర్, దొబ్బల ప్రవీణ్, జింక శ్రీధర్, జింక రాజు, ఈశ్వర్, అక్షయ్, అభిలాశ్, మనీశ్, నిరీక్షణ, మనోహర్, దినేశ్, అజయ్, యశ్వంత్, ఆదిత్య, ప్రసాద్ పాల్గొన్నారు.

### విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



విద్యార్థినులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యాప్రమాణాలు పెంపొందించే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోనరావుపేట మండలం మర్తనపేట ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, కేజీబీవీ, మర్రిమడ్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలోని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో దూస రఘుపతి, ఆర్‌ఐ రాజశేఖర్, కేజీబీవీ ఎస్‌వో ఇందిర పాల్గొన్నారు.

### రెండు మండలాల్లో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలోని రెండు మండలాల్లో శుక్రవారం చిరుజల్లులు కురిశాయి. రుద్రంగిలో 3.8 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 3.7 మిల్లీమీటర్ల వర్షం పడింది.

# సహకారం దా‘రుణం’



ఇతను ముష్కం గంగాధర్‌గౌడ్. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ఈ రైతుకు 2.07 ఎకరాల భూమి ఉంది. కోనరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)లో గతంలో రూ.86వేల పంట రుణం తీసుకోగా.. ఇటీవల ఆ మొత్తం మాఫీ అయ్యింది. మళ్లీ క్రాప్‌లోన్ కోసం సహకార సంఘానికి వెళ్తే భూమిని మార్టిగేజ్(కుదువ పెట్టాలని) చేయాలన్నారు. కోనరావుపేట తహసీల్దార్ ఆఫీస్‌లో రైతు గంగాధర్ భూమిని సహకార సంఘం(బ్యాంకు) అధికారి పేరిట సింపుల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పాస్‌బుక్కు, ధరణి పహాణీ, వన్–బీ, ఈసీ కాపీలను తీసుకుని మళ్లీ రూ.85వేల రుణం ఇచ్చారు. ఇలా బావుసాయిపేటలో గంగాధర్‌గౌడ్ ఒక్కరే కాదు. దాదాపు ఇరవై మంది రైతులు తమ భూములను, పాస్‌బుక్కులను కుదువబెట్టి పంట రుణం తీసుకున్నారు.



ఇతను తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌కు చెందిన తోకల విఠల్. ఇతనికి 3.07 ఎకరాల భూమి ఉంది. సిరిసిల్లలోని యూనియన్ బ్యాంకులో గతంలో రూ.1.92 లక్షలు పంటరుణం తీసుకున్నాడు. క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తున్నాడు. ఇటీవల విఠల్‌కు క్రాప్‌లోన్ మాఫీ కావడంతో మళ్లీ బ్యాంకు అధికారులను కలిశాడు. మరోసారి రూ.1.92లక్షలు పంట రుణం పొందాడు. యూనియన్ బ్యాంకు అధికారులు కేవలం రైతు పాస్‌బుక్కు, వన్–బీ, పహాణీ, ఈసీ తీసుకుని రుణం మంజూరు చేశారు.

- పంటరుణానికి భూమి మార్టిగేజ్
- తహసీల్దార్ ఆఫీస్‌లో రైతుల భూముల తనఖా
- వాణిజ్య బ్యాంకుల్లో లేని నిబంధనలు అమలు
- వాటాధనం పేరిట నిలువు దోపిడీ
- ఇవి సహకార బ్యాంకుల లీలలు



వరి పొలానికి మందు కొడుతున్న రైతు

సిరిసిల్ల: రైతులు పంటల సాగుకు పెట్టుబడి కోసం బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుంటారు. ఎకరానికి రూ.45వేలు మొదటిసారి, ఆ తరువాత సాగుచేసే పంట ఆధారంగా బ్యాంకర్లు రుణం మంజూరు చేస్తారు. జిల్లాలో సహకార సంఘాల(బ్యాంకు) అధికారులు రైతుల భూములను మార్టిగేజ్ చేయించుకుని రుణాలు ఇస్తుండగా.. అదే వాణిజ్య బ్యాంకులు ఎలాంటి మార్టిగేజ్ లేకుండానే రుణాలు ఇస్తున్నాయి. పంటరుణం కాకుండా ఎక్కువ మొత్తంలో డబ్బులు అవసరమైతేనే భూమిని మార్టిగేజ్ చేసుకుని దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడం పరిపాటి. కానీ పంటరుణాలకే తహసీల్దార్ వద్ద మార్టిగేజ్ చేయించుకోవడం దారుణం. భూమి విలువ జిల్లాలో ఎకరాకు రూ.20లక్షలకు మించి ఉండగా.. సహకార బ్యాంకు అధికారులు ఇచ్చే రూ.45వేలకు లక్షల విలువైన భూమిని మార్టిగేజ్ చేయడంపై రైతు సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని సహకార సంఘాల్లో ఈ దారుణాలు సాగుతున్నాయి.

**సహకార బ్యాంకుల్లో వాటాధనం బాదుడు**

జిల్లాలోని సహకార సంఘాల్లో వాటాధనం పేరిట రైతులు తీసుకున్న రుణం ఆధారంగా రూ.5వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. నిజానికి సహకార సంఘాల బలోపేతం కోసం రైతుల వద్ద వాటాధనం తీసుకుంటారు. ఇది ఒక్కసారి తీసుకుంటే శాశ్వతంగా ఆ సభ్యుడి పేరిట ఉండిపోతుంది. కానీ జిల్లాలోని సహకార సంఘాల్లో అప్పు తీసుకున్న ప్రతీసారి వాటాధనం వసూలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నామంటూ బుకాయిస్తున్నారు. మరోవైపు భూములను మార్టిగేజ్ చేసుకుని పెద్ద మొత్తంలో ఇచ్చే రుణాల్లో సహకార సంఘాల పాలకవర్గాలు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు చందుర్తిలో చనిపోయిన రైతుల పేరిట, భూమి లేని వారికి భూమి ఉన్నట్లుగా తప్పుడు రికార్డులు రాసి పంట రుణాలు స్వాహా చేసిన విషయం వెలుగుచూసింది. ప్రభుత్వం చేసిన రుణమాఫీలో చనిపోయిన వారి పేర్లు రావడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఈ వ్యవహారంలో అధికారులు చందుర్తి సింగిల్‌విండో సీఈవోను సస్పెండ్ చేశారు.



సిరిసిల్లలోని కేడీసీసీ బ్యాంకు భవనం

**జిల్లాలో పంటరుణాలు ఇలా..**

| | |
|---|---|
| అన్ని రకాల బ్యాంకులు | 71 |
| ప్రభుత్వరంగ బ్యాంకులు | 14 |
| సహకార బ్యాంకులు | 23 |
| పంటరుణాల ఖాతాలు | 63,502 |
| రుణమాఫీ ఖాతాలు | 43,770 |
| రుణమాఫీ మొత్తం | రూ.346.16 కోట్లు |

**దీనిపై అడిగాం**



కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి బ్యాంకు సమావేశంలో పంట రుణాలకు మార్టిగేజ్ చేయడంపై అడిగాము. సహకార బ్యాంకులో రుణాలు పొందిన ఇద్దరు రైతులతో జమానత్ తీసుకుని పంట రుణాలు ఇవ్వాలని చెప్పారు. పంట రుణం రూ.1.60లక్షలు దాటితే మార్టిగేజ్ చేసుకోవాలని చెప్పారు. కొందరు రైతులు ఇద్దరిని జమానత్ తేలేకనే భూమిని మార్టిగేజ్ చేస్తున్నారు.

– బండి దేవదాస్, సింగిల్‌విండో చైర్మన్, సిరిసిల్ల

**మార్టిగేజ్‌కు వస్తున్నారు**



ముస్తాబాద్‌లో ఇప్పటి వరకు 300 మంది రైతుల భూములను సహకార బ్యాంకు అధికారుల పేరిట మార్టిగేజ్ చేశాను. పంటరుణాల కోసం రైతులు స్లాట్ బుక్ చేసుకుని వస్తున్నారు. ఒక్కో రోజు 15 డాక్యుమెంట్లు మార్టిగేజ్‌వి ఉంటున్నాయి. అన్ని సహకార బ్యాంకు అధికారులకే చేస్తున్నాం. గతంలో ఈ విధానం లేదు. ఇటీవల ఎక్కువైంది.

– సురేశ్, తహసీల్దార్, ముస్తాబాద్

**పంట రుణాలకు మార్టిగేజ్ అక్కర్లేదు**



పంట రుణాలకు రైతుల భూములను మార్టిగేజ్ చేయాల్సిన అవసరం లేదు. సహకార బ్యాంకు నిబంధనల మేరకు రూ.1.60లక్షలు పంట రుణం దాటితే.. మార్టిగేజ్ చేయాల్సి ఉందని ఆ బ్యాంకు సీఈవో వెల్లడించారు. తక్కువ మొత్తంలో పంట రుణాలు తీసుకునే సన్న, చిన్నకారు రైతులు తమ భూములను బ్యాంకు పేరిట మార్టిగేజ్ చేయాల్సిన పని లేదు.

– ఎన్.మల్లికార్జున్, ఎల్‌డీఎం, సిరిసిల్ల

# రైతులపై మొసలి కన్నీరు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- సానుభూతి పొందేందుకు బీఆర్‌ఎస్ రుణమాఫీ డ్రామాలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): పదేళ్లపాటు అధికారంలో ఉండి రైతుల సమస్యలను పట్టించుకోలేని బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్, కేసీఆర్‌లు రైతులపై మొసలి కన్నీరు కార్చుతున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అర్హులైన రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం వారి సానుభూతి పొందేందుకు రుణమాఫీపై రాజకీయ డ్రామా ఆడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటే బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతుబంధు పేరిటా రియల్ ఎస్టేట్ భూములకు సైతం డబ్బులు ఇచ్చారన్నారు. భూస్వాములకు దోచిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ అర్హులైన రైతులకే రైతుభరోసా ఇస్తుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్, నాయకులు భీంరాజు కనకరాజు, సంటి ప్రసాద్, మల్లారపు రాజు, దొంగరి భూమయ్య, మ్యాకల గణేశ్, ఈర్ల రవి పాల్గొన్నారు.

### కుంటకు మరమ్మతులు



కుంటకు పడ్డ బుంగను జేసీబీతో మరమ్మతు చేస్తున్న అధికారులు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రేపాక గ్రామంలోని పాకలవానికుంటకు శుక్రవారం బుంగపడగా ఇరిగేషన్ అధికారులు హుటాహుటిన మరమ్మతులు చేపట్టారు. పాకాల వాని కుంట మత్తడి వద్ద బుంగ పడగా గమనించిన గ్రామస్తులు మాజీ ఎంపీటీసీ సుమలతకు తెలిపారు. ఆమె ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా.. వెంటనే ఇరిగేషన్ అధికారులకు తెలియజేశారు. ఇరిగేషన్ అధికారులు డీఈ శ్రీనివాస్, ఏఈ రాధిక బుంగను జేసీబీ సహాయంతో మరమ్మతు చేశారు.

# డెంగీ కాదు.. వైరల్ ఫీవర్స్

- డీఎంహెచ్‌వో వసంతరావు

సిరిసిల్ల: ఇద్దరికి డెంగీ సోకినట్లుగా జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరిని డీఎంహెచ్‌వో వసంతరావు, డీసీహెచ్‌ఎస్ పెంచలయ్య శుక్రవారం పరిశీలించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డెంగీ అనుమానిత పేషెంట్లను డాక్టర్ల బృందం పరిశీలించింది. వారి ఆరోగ్య పరిస్థితి, మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. అవి డెంగీ లక్షణాలు కావని, వైరల్ ఫీవర్స్‌గా నిర్ధారించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వైద్యులు వంశీ, నయీమ్ జహా, ఎపిడిమోలోజిస్ట్ సోనీమణి ఉన్నారు.



జిల్లా ఆస్పత్రిలో జ్వరపీడితుడితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్

### విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

- డీఈవో రమేశ్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

సిరిసిల్లటౌన్: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో రమేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రం శివారులోని భూపతినగర్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో హాజరుశాతం పెంచాలని, విద్యార్థుల గ్రాహకశక్తిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

# ప్రసవాల సంఖ్య పెంచాలి

- సీజనల్ వ్యాధులపై శ్రద్ధ పెట్టాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా
- నేరెళ్ల పీహెచ్‌సీ తనిఖీ



నేరెళ్ల పీహెచ్‌సీలో వృద్ధురాలుతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్యాధికారులను ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్లు, ఓపీ, కాన్పుల రిజిష్టర్, ఫ్రిడ్జ్‌లో వ్యాక్సిన్ తనిఖీచేసి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛత, పరిశుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వ్యాధులపై దృష్టి పెట్టి మెడిసిన్ అందించాలని సూచించారు. హాస్పిటల్‌కు కిట్లు, మందులు అవసరమైతే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పద్మనగర్ కేజీబీవీని తనిఖీ చేశారు. విద్యాలయం ఆవరణ, వంట సామగ్రి, స్టోర్ రూమ్, కిచెన్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేయాలని సూచించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మ్యాథ్స్, ఇంగ్లిశ్, బయోసైన్స్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేశారు. మెడికల్ అధికారి జి.రేఖ, వైద్యసిబ్బంది, పీజీ సీఆర్‌టీ సంతోషిణి పాల్గొన్నారు.

# విద్యార్థినులు మౌనం వీడాలి



గంజాయి అవగాహన ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై అవగాహన ఉండాలి
- బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల: విద్యార్థినులు మౌనం వీడాలని, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల వెంకంపేట జెడ్పీ హైస్కూల్ బాలికలతో శుక్రవారం ‘పోక్సోపై చైతన్యం’ అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ బాలికలకు బ్యాడ్ టచ్ సంఘటనలు ఎదురైనప్పుడు వారు స్వేచ్ఛగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు చెప్పుతారనే లక్ష్యంతో పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యతను పోలీస్‌శాఖ ఇస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు చక్కటి లక్ష్యాలు ఎన్నుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. మైనర్ బాలికలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవితఖైదీ వంటి శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. బాలికలకు ఇంట్లో, పాఠశాలల్లో, వీధుల్లో ఇరుగుపొరుగు వారితో ఎదురయ్యే వేధింపులు, అసభ్య ప్రవర్తన, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి నిర్భయంగా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వంటి వాటిని వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా షీటీమ్ నంబర్ 87126 56425లో ఫిర్యాదు చేయాలన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం, సీడబ్ల్యూసీ చైర్మన్ అంజయ్య, షీటీమ్ ఏఎస్సై ప్రమీల, షీటీమ్ సిబ్బంది రమాదేవి, ప్రియాంక, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా పాల్గొన్నారు.

**గంజాయిని నిర్మూలిద్దాం**

జిల్లాలో గంజాయిని నిర్మూలిద్దామని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో గంజాయిపై అవగాహన రథాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లా పోలీస్ వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. గంజాయి కిట్ల సహాయంతో పరీక్షలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయాలు, రవాణా, సేవించిన వారి వివరాలను 87126 56392లో తెలపాలని కోరారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణే లక్ష్యం

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

వీర్నపల్లి(సిరిసిల్ల): నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తుందని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వీర్నపల్లి ఠాణా పరిధిలోని రంగంపేటలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఇంటింటీ తనిఖీలు చేపట్టారు. సరైన సర్టిఫికెట్లు, నంబర్‌ప్లేట్లు లేని 30 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన 120 లీటర్ల జాగిరి, 4 లీటర్ల గుడుంబా, బెల్ట్‌షాప్‌లో రూ.3వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకొని, వారిపై కేసులు నమోదు చేశారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో స్వీయరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎల్లగౌడ్, గణేశ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**అట్రాసిటీ కేసుపై విచారణ**

వీర్నపల్లి మండల కేంద్రంలో ఒకరిపై నమోదైన అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండలకేంద్రానికి చెందిన జనార్దన్ అనే వ్యక్తి తనపై దాడి చేయడంతోపాటు కులం పేరుతో దూషించారని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాటి దినకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై ఎల్లాగౌడ్ గురువారం కేసు నమోదు చేయగా, శుక్రవారం డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

# ఫోర్టిఫైడ్ రైస్‌పై అపోహలు వద్దు

- డీఎస్‌వో జితేందర్‌రెడ్డి



గీతానగర్ హైస్కూల్‌లో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న డీఎస్‌వో జితేందర్‌రెడ్డి

సిరిసిల్ల: ఫోర్టిఫైడ్ రైస్‌పై అపోహలు వీడి, పిల్లలకు వండిపెట్టాలని జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ హైస్కూల్, సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం, ఎల్లారెడ్డిపేట జెడ్పీ హైస్కూల్, కేజీబీవీ, అల్మాస్‌పూర్, వీర్నపల్లి మోడల్ స్కూళ్లలో శుక్రవారం తనిఖీలు చేశారు. పిల్లలకు వండిపెడుతున్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న సన్నబియ్యం నిల్వ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోషకాలు, విటమిన్ బీ–12 అందించే ఫోర్టిఫైడ్ రైస్ విషయంలో వంట చేసే వారు తప్పుడు అవగాహనతో ఉన్నారని, బియ్యం కడిగేటప్పుడు ఫోర్టిఫైడ్ రైస్ నీటిపై తేలుతాయని, వాటిని నేలపాలు చేయకుండా బట్టకట్టి వడపోయాలని సూచించారు. ఫోర్టిఫైడ్ రైస్ పిల్లల్లో రక్తహీనత లేకుండా చేస్తాయని వివరించారు. సన్నబియ్యం నాసిరకంగా ఉంటే నివేదిక ఇవ్వాలని సూచించారు. పౌరసరఫరాశాఖ డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

## క్లుప్తంగా

### రుద్రంగి మాజీ ఎంపీపీ భర్తపై కేసు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి భర్త, బీఆర్ఎస్ నాయకుడు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గురువారం రుద్రంగి రాజకీయాలు అనే వాట్సాప్ గ్రూపులో మహేశ్ కాంగ్రెస్ నాయకులను అసభ్య పదజాలంతో దూషిస్తూ, పార్టీని, ప్రభుత్వాన్ని కించపరిచేలా వాయిస్ మెస్సేజ్‌లు పెట్టాడని కాంగ్రెస్ రుద్రంగి గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఇతరులనుద్దేశించి అవమానపరిచేలా, గొడవలకు దారితీసేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మెస్సేజ్‌లు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### 'అల్ఫోర్స్'లో ఘనంగా గోకుల్ ఉత్సవ్



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్, అల్ఫోర్స్ టైనీటాట్స్, భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శుక్రవారం గోకుల్ ఉత్సవ్ పేరిట ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల్లో భక్తిభావం పెంపొందించడానికి, చారిత్రక శ్రీకృష్ణుని చరిత్ర తెలియజేయడానికి వేడుకలు జరిపినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెదలాలని, భగవద్గీత పఠించాలని సూచించారు. సుమారు 350 మంది విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చి, నృత్యాలతో సందడి చేశారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని ఆరెపల్లికి చెందిన గడ్డి కొమురయ్య ఆత్మహత్యాయత్నం చేశాడని గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కొమురయ్య ఇంట్లో కొన్నేళ్లుగా కుటుంబ కలహాలున్నాయి. మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కలవారు వెంటనే వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

### ఆలయంలో చోరీ

రామగుండం: అంతర్గాం మండలం రాయదండి శివారులోని శ్రీచిలుకల రామేశ్వరాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ తోకల కుమార్ తెలిపారు. అమ్మవారి ముక్కు పుడక, నాలుగు జతల మంగళ సూత్రాలు, వెండి మెట్టెలను దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



# హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వైద్యుడిపై దాడి కేసులో ప్రధాన నిందితులు కూడా..
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కృష్ణ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కృష్ణ, పక్కన సీఐ, ఎస్సైలు

సుల్తానాబాద్‌రూరల్/ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండలంలోని కొలనూర్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కృష్ణ తెలిపారు. శుక్రవారం సుల్తానాబాద్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన రౌడీషీటర్(ప్రస్తుతం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న) పులిపాక శ్రీకాంత్ కొన్నిరోజుల క్రితం కొలనూర్‌లోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. గత బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇతనితోపాటు అదే గ్రామానికి చెందిన మాజీ హోంగార్డు మాటూరి విజయ్(40) వేర్వేరుగా స్థానిక బెల్ట్‌షాప్ వద్దకు వచ్చారు. అక్కడ మూత్రశాలలు సరిగా లేవని విజయ్ అనడంతో అతనికి, శ్రీకాంత్‌కు మధ్య మాటామాట పెరిగింది. ఇద్దరూ కొట్టుకున్నారు. శ్రీకాంత్ తన వద్ద ఉన్న కత్తితో విజయ్‌ని పొట్టలో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ గతంలో మంథని సుమన్ అనే రౌడీ షీటర్‌తో తిరిగి, ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చాడని ఏసీపీ తెలిపారు. గోదావరిఖని వన్‌టౌన్‌లో అతనిపై మూడు కేసులున్నట్లు పేర్కొన్నారు. మృతుడు విజయ్‌పైనా రెండు కేసులున్నాయని అన్నారు. మృతుడి భార్య స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశామని, సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరించినట్లు తెలిపారు.

**వైద్యుడిపై దాడి కేసులో మరో ఇద్దరు..**

కాల్వశ్రీరాంపూర్ పీహెచ్‌సీ వైద్యుడు పెద్దపల్లి మండలంలోని నిట్టూరుకు చెందిన బుసనవేణి మహేందర్‌పై గత నెల 30న దాడి చేసిన కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ కృష్ణ తెలిపారు. సంబంధిత వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పందిల్లకు చెందిన ఏఎన్ఎం కాసిపాక విజయ డ్యూటీకి రాకుండా విధులను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో వైద్యుడు మహేందర్ విధులకు హాజరవకుంటే ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానని ఆమెను మందలించారు. ఇది మనసులో పెట్టుకున్న విజయ ఈ విషయాన్ని తనకు పరిచయం ఉన్న అన్నం కృష్ణకు, అతని స్నేహితులకు చెప్పింది. అందరూ కలిసి పథకం ప్రకారం గత నెల 30న వైద్యుడు డ్యూటీ ముగించుకొని, తన స్నేహితుడు కడమళ్ల ప్రకాశ్‌రావు, ఎనగందుల మహేశ్‌లతో కలిసి కారులో ఇంటికి వెళ్తుండగా బూర్గుపల్లి(మంగపేట) వద్ద రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో వైద్యుడు మహేందర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన అన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 5న ఎ–3, 4, 5, 6, 7, 8 బాలాజీ, కోరడ్ల రఘువర్ధన్‌రెడ్డి, మామిడాల లవణ్‌కుమార్, హిమాయత్, దారంగుల సాగర్, బొక్కల ఆదిత్యలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు కాసిపాక విజయ, అన్నం కృష్ణ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కారులో శ్రీశైలం, హైదరాబాద్, యాదగిరిగుట్ట, విజయవాడ తిరుగుతూ గురువారం మంచిర్యాల నుంచి పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ మీదుగా వరంగల్ వెళ్తున్న ఆ ఇద్దరినీ పక్కా సమాచారంతో సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రీధర్‌లు గంగారం వద్ద అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ తెలిపారు. రెండు కేసులను చాకచక్యంగా ఛేదించిన సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు అశోక్, శ్రీధర్, శ్రవణ్‌కుమార్, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

## ఒకరు చోరబడి.. మరొకరు కాపలా ఉండి

- పెద్దపల్లి జిల్లా రచ్చపల్లిలో దొంగల తీరు
- యజమానులు రావడంతో పరారైన ముష్కరుడు
- ఇంట్లో మూలకు నక్కిన మరో వ్యక్తి
- ఆ తర్వాత దొంగ తనకు తెలుసని, పట్టిస్తానని చెప్పిన వైనం
- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



గ్రామస్తులు చెట్టుకు కట్టేసిన దొంగ

ధర్మారం(ధర్మపురి): ఓ దొంగ దర్జాగా బీరు తాగుతూ ఇంటి ఎదుట కాపలా కాస్తున్నాడు.. మరో దొంగ ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించాడు.. ఇదే సమయంలో ఇంటి యజమానులు రావడంతో కాపాలా ఉన్న దొంగ పారిపోగా.. ఇంట్లో ఉన్న వ్యక్తి మూలన నక్కి ఆ తర్వాత గ్రామస్తులకు చిక్కాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. రచ్చపల్లికి చెందిన వెముర్ల లింగయ్య–నర్సమ్మ దంపతులు. వీరికి కుమారుడు అంజయ్య, కోడలు కావ్యశ్రీ ఉన్నారు. వీరంతా శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి, పొలం పనులకు వెళ్లారు. వర్షం కురవడంతో సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. అయితే, ఇంటి ఎదుట వేపచెట్టు వద్ద ఓ యువకుడు మోటార్ సైకిల్‌పై కూర్చొని, బీరు తాగుతున్నాడు. తమ ఇంటి ఎదుట బీరు తాగొద్దని అంజయ్య సూచించాడు. అయితే, తాను ధర్మారం వెళ్తూ ఇక్కడ ఆగానని అతను చెప్పడంతో అనుమానం వచ్చిన అంజయ్య.. విషయం సమీపంలోని తన బాబాయికి చెబుతూ ఇంట్లోకి వెళ్లాడు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఈలోగా బైక్‌పై ఉన్న యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. అంజయ్య వెంటనే ఇంటి తలుపులు మూసి గడియ పెట్టాడు. పారిపోయింది దొంగ అని నిర్ధారించుకొని గ్రామస్తులతో వెతికేందుకు విఫలయత్నం చేశాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చి గడియ తీసి లోనికి వెళ్లాడు. అయితే, బీరువాలోని బట్టలు చిందరవందరగా పడేసి ఉండటం, అరతులం బంగారు ఉంగరం కనిపించకపోవడంతో చోరీ జరిగిందని భావించాడు. ఈలోగా గ్రామస్తులు, బంధువులు అక్కడకు చేరుకున్నారు. చోరీ విషయంపై ఆరా తీస్తుండగానే.. అప్పటికే ఇంట్లో నక్కిన దొంగ.. బీరువా వెనకాల నుంచి బయటకు వచ్చాడు. తాను దొంగను చూశానని, అతడిని పట్టిస్తానని గ్రామస్తులతోపాటు అంజయ్యతో నమ్మబలికాడు. అసలు నువ్వెవరని వారు ప్రశ్నించగా.. మోటార్ సైకిల్‌పై పారిపోయిన వాడు తన మిత్రుడు రాజు అని, అతడు ఇంటి తాళం పగులకొట్టి చోరీకి ప్రయత్నించాడని తెలిపాడు. ఈలోగా మీరు రావడాన్ని చూసి ఇంట్లోకి వెళ్లి దాక్కున్నట్లు దొంగ వివరించాడు. కోపోద్రిక్తులైన గ్రామస్తులు, బాధితులు అతన్ని తాళ్లతో బంధించి, చెట్టుకు కట్టేసి కొట్టారు. పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే గ్రామానికి చేరుకొని, ఠాణాకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

## 'మేం పోలీసులం.. నిన్ను చెక్ చేయాలి'

- గంజాయి పేరిట వృద్ధుడి బంగారు చైన్, ఉంగరం అపహరణ



బైక్‌పై వెళ్తున్న నిందితులు

కోరుట్ల: 'మేం పోలీసులం.. నీ దగ్గర గంజాయి ఉందని సమాచారం ఉంది.. నిన్ను చెక్ చేయాలని' ఓ వృద్ధుడిని ఇద్దరు యువకులు బెదిరించారు. అతని వద్ద నుంచి బంగారు చైన్, ఉంగరం అపహరించిన సంఘటన కోరుట్లలో చోటుచేసుకుంది. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని దేశాయ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి భూమరాజం(65) శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో కూరగాయలు కొనుగోలు చేసి, ఇంటికి వెళ్తున్నాడు. ఇందిరా రోడ్‌లో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి అతన్ని ఆపారు. తాము పోలీసులమని, నీ వద్ద గంజాయి ఉందని తెలిసిందని, చెక్ చేయాలన్నారు. ఆ తర్వాత నీ వద్ద ఉన్న బంగారు చైన్, ఉంగరం దొంగవి అని అనుమానంగా ఉందని చెప్పి, వాటిని తీసుకున్నారు. ఆ తర్వాత అక్కడినుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుల సీసీ ఫుటేజీ దృశ్యాలు విడుదల చేశామని, వారి కోసం వెతుకుతున్నట్లు పేర్కొన్నారు.

### వివిధ కేసుల్లో ఎనిమిది మందికి జైలు

సిరిసిల్ల కల్చరల్: రాజన్నసిరిసిల్ల జిల్లాలో వివిధ కేసుల్లో ఎనిమిది మంది నేరస్తులకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తులు తీర్పు వెల్లడించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాల ప్రకారం.. సిరిసిల్ల సుందరయ్య నగర్‌కు చెందిన ఆడెపు రాజు స్థానికంగా సెల్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి, విక్రయిస్తున్నాడు. 2017లో అప్పటి ఎస్సై లియాకత్ అలీ కానిస్టేబుల్ రాకేశ్‌ను కస్టమర్‌గా పంపించారు. ఆయన రాజు వద్దకు వెళ్లి, రూ.100 ఇవ్వడంతో మెమొరీ కార్డులో పోర్న్ వీడియోలు నింపి, ఇచ్చాడు. దీంతో పోలీసులు అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఐదుగురు సాక్షులను శుక్రవారం సిరిసిల్ల కోర్టులో ప్రవేశపెట్టగా రాజుకు ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ రెండేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు.

**హత్యాయత్నం కేసుల్లో ఏడుగురికి..**

హత్యాయత్నం కేసుల్లో ఇరువర్గాలకు చెందిన ఏడుగురికి ఏడాది జైలుశిక్ష పడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పవన్ వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన రావుల వెంకటేశ్, కొండయ్య, నర్సయ్య, మర్రి తిరుపతిలకు రావుల బాలకృష్ణ, దేవా, రఘులతో భూ తగాదాలున్నాయి. 2022 జనవరిలో పొలంలో కూర్చొని ఉన్న వెంకటేశ్‌పై బాలకిషన్, దేవా, రఘు గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్ వర్గీయుల దాడిలో బాలకిషన్ గాయపడ్డాడు. రావుల కొండయ్య ఫిర్యాదు మేరకు బాలకిషన్, దేవా, రఘులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలకిషన్ ఫిర్యాదు మేరకు వెంకటేశ్, కొండయ్య, నర్సయ్య, తిరుపతిలపై కేసు నమోదైంది. అప్పటి ఎస్సై విజయ్‌కుమార్ నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో 9 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువవడంతో న్యాయమూర్తి రాధికా జైస్వాల్ ఒక్కొక్కరికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.

### ఖాతా నుంచి రూ.4.9 లక్షలు మాయం

మానకొండూర్ రూరల్: ఇన్‌స్టాగామ్ లింక్ ఓపెన్ చేసిన ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ.4.92 లక్షలు మాయమయ్యాయి. సీఐ సదన్‌కుమార్ వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని ఊటూర్‌కు చెందిన నెమ్మది ప్రశాంత్‌కు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇన్‌స్టాగామ్‌లో లింకు వచ్చింది. ఓపెన్ చేయగానే అతని బ్యాంకు అకౌంట్ నుంచి రూ.4.92 లక్షలు పోయాయి. రాత్రి బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### యువకుడి బలవన్మరణం

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉండే పేరం మనోజ్‌కుమార్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లక్ష్మణ్‌రావు వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా బిట్రగుంటకు చెందిన మనోజ్‌కుమార్ ఉపాధి నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి శాంతినగర్‌లో ఉంటున్నాడు. అతనికి అప్పులుండటంతో నిత్యం బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై, శుక్రవారం ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ఉంది.

### యువకుడి ఆత్మహత్య



చరణ్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కలికోట గిరిజన తండాకు చెందిన ధరావత్ చరణ్(18) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చరణ్ ఇంటర్మీడియట్ మధ్యలోనే మానేశాడు. తమ బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసి, వృథాగా ఖర్చు చేస్తున్నాడని అతని తల్లిదండ్రులు గుర్తించారు. ఎందుకు ఇలా చేస్తున్నావంటూ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన చరణ్ గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి పోయి, గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం గ్రామస్తులు అతని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి తండ్రి బాబు రెడ్డి నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## 'రూ.25 వేలిస్తే గంజాయి కేసు మాఫీ చేస్తాం'

- ముత్యంపేటవాసికి ఫేక్ కాల్

మల్యాల(చొప్పదండి): 'మీ కొడుకు కెనడాలో గంజాయి కేసులో పట్టుబడ్డాడు.. రూ.25 వేలిస్తే కేసు మాఫీ చేస్తాం' అంటూ ఓ వ్యక్తికి ఫేక్ కాల్ వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన రవి కుమారుడు కెనడాలో ఉన్నాడు. శుక్రవారం ఓ వ్యక్తి రవికి ఫోన్ చేసి, రూ.25 వేలిస్తే మీ కొడుకుపై ఉన్న గంజాయి కేసు మాఫీ చేస్తామన్నాడు. అనుమానం వచ్చిన అతను తన వద్ద రూ.5 వేలు ఉన్నాయని, కాసేపు ఆగి, పంపిస్తానని ఫోన్ కట్ చేశాడు. తర్వాత తన కుమారుడికి ఫోన్ చేయగా తాను సురక్షితంగా ఉన్నానని చెప్పడంతో ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నాడు. దీనిపై సీఐ రవిని సంప్రదించగా ఈ మధ్య ఫేక్ కాల్స్ చాలా వస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ ఓటీపీ చెప్పవద్దని, డబ్బులు పంపవద్దని సూచించారు.

### వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): వరకట్నం కోసం ఓ వివాహితను వేధిస్తున్న ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన శ్రావ్యను అదే గ్రామానికి చెందిన ఎర్ర అశోక్ నాలుగేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక పాప ఉంది. ఈ క్రమంలో కొంతకాలంగా రూ.4 లక్షల కట్నం తీసుకురావాలని భర్త అశోక్, అత్త రాజేశ్వరి, మామ సారయ్య ఆమెను వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

## గంజాయి ఉంటే పట్టేస్తాయి..

- పోలీసు జాగిలాలతో గంజాయి వేట



పోలీస్ జాగిలాలతో తనిఖీ చేస్తున్న సీఐ స్వామి

తిమ్మాపూర్(మానకొండూర్): గంజాయిని నిరోధించడానికి నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలాలతో కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్, ఎల్ఎండీ పరిధిలోని బస్టాండ్, పాన్ షాప్‌లు, కిరాణాషాపుల్లో తనిఖీలు చేశామని సీఐ స్వామి తెలిపారు. గంజాయిని రవాణా చేసే వ్యక్తులను సీపీ అభిషేక్ మహంతి ఆదేశాలతో పోలీస్ జాగిలాల ద్వారా పట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై చేరాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠాలు చెప్పే టైంలో ఫంక్షన్‌లో..

- ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్వాకం



వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయుడు(వృత్తంలో)

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు శుభకార్యానికి హాజరుకావడం చర్చనీయాంశమైంది. కొందరు టీచర్లు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. వివరాలు.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చౌలమద్ది ప్రభుత్వ పాఠశాలలో గాదె నర్సింగరావు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఉదయం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం 1.30 గంటలకు పట్టణంలో ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. అక్కడ సుమారు 45 నిమిషాలు గడిపాడు. ఇది గమనించిన 'సాక్షి' 3 గంటల సమయంలో పాఠశాలకు వెళ్లి చూడగా, ఆఫీస్ రూంలో కనిపించాడు. నిబంధనల ప్రకారం మధ్యాహ్నం 12.10 గంటల నుంచి 1.10 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. తర్వాత సాయంత్రం 4గంటల వరకు తరగతులు ఉంటాయి. నర్సింగరావు తరగతి గదిలో ఉండాల్సిన సమయంలో తీరిగ్గా శుభకార్యానికి వెళ్లి, తిరిగి విధులకు హాజరు కావడంపై అక్కడే ఉన్న ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌ను వివరణ కోరగా, ఎంఈవో పర్మిషన్ తీసుకొని వెళ్లాడని బదులిచ్చారు. ఇదే విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లగా తాను లంచ్ బ్రేక్‌లో మాత్రమే వెళ్లి రావాలని సూచించానన్నారు. అంతేగానీ, తరగతులు నడిచే సమయంలో వెళ్లాలని చెప్పలేదని పేర్కొనడం గమనార్హం.

## ముష్టిపల్లివాసిని స్వగ్రామం పంపండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సౌదీ అరేబియాలోని ఎంబసీకి లేఖ

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పరిధిలోని ముష్టిపల్లికి చెందిన చీమల మహేశ్‌ను స్వగ్రామం పంపించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సౌదీ అరేబియాలోని ఎంబసీకి శుక్రవారం ఆయన లేఖ రాశారు. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్‌కు భార్య సంతోషి(30), ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అతను బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితమే సౌదీ వెళ్లి, అక్కడి ఓ కంపెనీ పనిలో చేరాడు. ఈ క్రమంలో గ్రామంలో గురువారం వ్యవసాయ పనులు ముగించుకొని, ఇంటికి వస్తున్న సంతోషి ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతిచెందింది. మహేశ్ భార్య చనిపోయిందని, అతను త్వరగా ఇంటికి వచ్చేలా చూడాలని కోరుతూ బంధువులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిశారు. స్పందించిన ఆయన మహేశ్‌ను త్వరగా స్వదేశానికి పంపించాలంటూ సౌదీలోని ఎంబసీకి లేఖ రాసి, అక్కడి అధికారులతో మాట్లాడారు. వారు ఈరోజే(శుక్రవారం) ఇండియాకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రాజన్న ఆలయంలో భక్తుల సందడి



ఆలయంలో భక్తులు



అమ్మవారికి ఒడి బియ్యం..

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో శుక్రవారం శ్రావణ సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రొటోకాల్ కార్యాలయంలో వీఐపీలకు బ్రేక్ దర్శనాల టికెట్లు అందించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

రాజన్న ఆలయంలోని శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, మహాలక్ష్మి హోమం జరిపారు. రేవతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీ అనంత పద్మనాభస్వామి వారికి ఉదయం అభిషేకం, సాయంత్రం సదస్యం నిర్వహించారు.

## 'చంద్రయాన్‌తో అగ్రదేశాల సరసన భారత్'



మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్: చంద్రయాన్ ప్రయోగంతో భారత్ అగ్రదేశాల సరసన నిలిచిందని రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం, ఇస్రో చేపట్టిన చంద్రయాన్ ప్రయోగం విజయవంతమవడం మన దేశానికి గర్వకారణమన్నారు. అంతరిక్ష ప్రయోగాలు సక్సెస్ అవుతుండడం దేశ అభివృద్ధికి చిహ్నమని తెలిపారు. రాకెట్ ప్రయోగాలకు రాకెట్లను సైకిళ్లపై తీసుకెళ్లిన స్థాయి నుంచి నేడు రోదసీలో మన దేశ జెండాను నిలిపే స్థాయికి ఎదిగిన ఘన చరిత్ర ఇస్రోదని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేవారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ



చిందరవందరగా వస్తువులు


పాలకుర్తి(రామగుండం): మండలంలోని బామ్లానాయక్ తండాలో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. బామ్లానాయక్ తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ బుజ్జి శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి, వ్యవసాయ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన అరతులం బంగారం, 25 తులాల వెండి కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుంది. ఈ ఘటనపై బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

**నెల వ్యవధిలో 3 ఘటనలు..**

బామ్లానాయక్ తండాలో నెల రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయని తండావాసులు తెలిపారు. గ్రామంలో ఎన్టీపీసీ సీఎస్సార్ పథకం కింద ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలకు సంబంధించిన 10 బ్యాటరీలను 20 రోజుల క్రితం దుండగులు ఎత్తుకెళ్లారని అన్నారు. మూడు రోజుల క్రితం మరో బ్యాటరీ చోరీ చేశారని పేర్కొన్నారు. వరుస ఘటనలతో భయంభయంగా గడుపుతున్నామని, పోలీసులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- 21 ట్రాక్టర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు
- కేసు నమోదు



తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్లు

కోరుట్ల: ఇసుక అక్రమ రవాణాపై కోరుట్ల రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. రెండు రోజుల వ్యవధిలో కోరుట్ల పట్టణంలో 21 ట్రాక్టర్లను పట్టుకున్నారు. వీటిలో రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. మిగతా 19 ట్రాక్టర్లు ఇదివరకు ఎన్నిసార్లు పట్టుబడ్డాయి.. వాటికి ఫిట్‌నెస్ పత్రాలు, డ్రైవర్లకు లైసెన్స్ ఉన్నాయా.. లేదా పరిశీలించి, తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిసింది. ఓవైపు అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటుండగా కథలాపూర్ మండలంలోని తక్కళ్లపల్లి, నాగులపేట ప్రాంతాల నుంచి అర్ధరాత్రి టిప్పర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం.

### విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లికి చెందిన దొంత మైసయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి వి.వెంకటేశ్ తీర్పు చెప్పారని విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.షాదుల్లా బాబా తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మైసయ్య తన ఇంటికి అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తూ అధికారులు పట్టుబడ్డాడు. వారు విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేసి, మొదటి నేరం కింద రూ.500 జరిమానా విధించి, వదిలేశారు. మైసయ్య మరోసారి విద్యుత్ వినియోగిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువవడంతో మైసయ్య రూ.2,817 జరిమానా చెల్లించాలని లేదంటే ఒక నెల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పు వెల్లడించారు.